క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని 'సెస్' పట్టణ ఏఈలు మధుకర్, సుష్మా తెలిపారు. పట్టణ శివారులోని ట్రాన్స్‌కో 220 కేవీలో నిర్వహణ పనులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పారదర్శకంగా పనులు చేపట్టాం



తీర్మాన ప్రతులు చూపుతున్న రాజేందర్‌రెడ్డి

ముస్తాబాద్: ముస్తాబాద్ సింగిల్‌విండో పనితీరును అప్రతిష్టపాలు చేసేందుకే కొందరు తనపై అవిశ్వాసం పెట్టారని చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి అన్నారు. సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లలో పారదర్శకంగా సింగిల్‌విండో పనులు చేపట్టామన్నారు. డైరెక్టర్ల సమావేశంలో తీర్మాణాల మేరకు అభివృద్ధి పనులు చేశామన్నారు. రుణాలు తీసుకున్న వారు కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి తెచ్చామని, దీనిని డైరెక్టర్లు తప్పుగా భావించారన్నారు. సంఘానికి లక్షలాది రూపాయల విలువ చేసే స్థలాన్ని కొనుగోలు చేసి అభివృద్ధి చేశామన్నారు. రాజకీయంగా ఎదుర్కొలేక అవిశ్వాసం పెట్టిన విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం గమనించి తనకు అండగా ఉండటంతో అవిశాస్వం వీగిపోయిందన్నారు. తనపై చేసిన ఆరోపణలను రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. సమావేశంలో డైరెక్టర్లు రమణారెడ్డి, కొండల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులున్నారు.

కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇల్లంతకుంట : ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలపై తెలంగాణ సాంస్కృతిక కళాకారులు మండలకేంద్రంలో కళా ప్రదర్శన నిర్వహించారు. సోమవారం మండలంలోని అనంతారం, పెద్ద లింగాపూర్‌లో అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పెంపు, రుణమాఫీ తదితర పథకాలపై ప్రజల కు వివరించారు. కళాబృందం టీం లీడర్ ఎడమల శ్రీధర్ రెడ్డి, కళాకారులు పొత్తూరి రాజు, శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేటలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలుగో సంవత్సరం విద్యార్థులు రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానం, వర్మివాష్ తయారీ విధానంపై రైతులకు వివరించారు. అలాగే భూసార పరీక్ష చేయడానికి పొలాల్లో నుంచి ఎలా తీయాలో రైతులకు ప్రదర్శన ద్వారా తెలియజేశారు. వర్మీ కంపోస్ట్ విద్యార్థులు, గ్రామ కమిటీ సభ్యులు సతీశ్, మాధవి, సంపత్, పర్శరాములు తదితరలుల పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



అనిల్

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని దుమాల గ్రామానికి చెందిన చకినాల అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ టీపీటీఎఫ్‌లో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనిల్‌కుమార్ కామారెడ్డి టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడంపై దుమాల గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక రొండ్‌బోర్డు పరిసరాల్లో బస్‌షెల్టర్ నిర్మించాలని సీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు.

మట్టి తరలిస్తున్న వ్యక్తులపై కేసు

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఒక జేసీబీ, మూడు టిప్పర్లను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.





ప్రమాదకరంగా మూల మలుపులు..

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల మధ్య రహదారిపై సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల మధ్య ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. రోజూ వందలాది వాహనాలు వెళ్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయడం లేదు. ఈ మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – కోనరావుపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం



పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు

ఇల్లంతకుంట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసి అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం మండలంలోని పొత్తూరులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని, ఈ సందర్భంగా గ్రామగ్రామాన ఎర్ర జెండాలు ఎగురవేసి అమరుల స్తూపం వద్ద నివాళి అర్పించడం, వారి చరిత్రను వెలికితీస్తూ ప్రజలకు వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద సుదర్శన్, మండల కార్యదర్శి భూంపల్లి భూమిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి



ధర్నా చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో 90శాతం పైగా పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్నారని, వారందరికీ కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, అర్హులకు సాగునీటి సౌకర్యంతో ఎకరం భూమి, 200 గజాల స్థలంతో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు ఎడపెల్లి బాబు, ఉల్లెందుల అరుణ్, కేసుగాని పరమేశ్వరి, బడే అమర్, భీమ్ ప్రకాష్, భీమ్ కీర్తన, కవ్వంపెల్లి గోవర్ధన్, కుర్మ సురేశ్, కుడుకల మధు, కుంటాల ప్రవీణ్, కుంటాల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ పూడికతీత పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగసముద్రం కెనాల్ పూడిక తీత పనులను సోమవారం రైతులు ప్రారంభించారు. ఉపాధిహామీ పనుల ద్వారా కెనాల్ మరమ్మతుకు పనులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఎల్లారెడ్డిపేట సత్సంగం నుంచి కాసువాగు వరకు ఉన్న కెనాల్‌లో పూడికతీతతోపాటు చెట్లు, చెత్త తొలగించడం జరుగుతుందన్నారు. కెనాల్ నుంచి కొందరు నీటిని మోటార్ల ద్వారా తరలిస్తున్నారని రైతులు నీటి చౌర్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నాయకుడు ఒగ్గు బాలరాజుయాదవ్, సుధాకర్,రాజయ్య, శ్రీకాంత్, ఎల్లయ్య, తిరుపతి, శరవింద్, విఠల్‌రెడ్డి, సత్యంరెడ్డి, బాల్‌రెడ్డి, ఆనందం, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, దేవయ్య, నర్సయ్య, కిషన్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం



ఆంజనేయులు



శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా సైకాలజిస్టు అసోసియేషన్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా యెలగొండ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి చొప్పదండి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్ తదితరులు అభినందించారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

కోనరావుపేట: మండలంలోని మంగళ్లపల్లి, రామన్నపేట, మల్కపేట గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తెలిపారు. సుద్దాల క్రాస్‌రోడ్డు నుంచి మంగళ్లపల్లి రోడ్డు నిర్మాణం, రామన్నపేట–కొలనూర్ మధ్యలో వంతెన నిర్మాణం, మల్కపేట రామాలయం వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

కేటీఆర్ ఫ్లెక్సీలు తొలగింపు

ముస్తాబాద్: సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెర్లుమద్ది చౌరస్తా వద్ద, నామాపూర్ క్రాసింగ్‌లో ఉన్న కేటీఆర్ ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించి, ట్రాక్టర్లలో తరలించారు. పంచాయతీ అనుమతులు లేవని కేటీఆర్ ఫ్లెక్సీలు ఉన్న బోర్డులను తీసివేయడంపై కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆవేదన వ్యక్తం చేశాడు. పదేళ్ల మంత్రిగా, పదిహేను సంవత్సరాలుగా ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ ఫ్లెక్సీలను అనుమతుల పేరుతో తొలగించడం సరికాదన్నారు.

స్వయం పాలనా దినోత్సవం

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు భోదించారు. చిన్నారులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలిగా బొబ్బల అక్షిత, వ్యాయామ ఉపాధ్యాయుడిగా వంగపల్లి విగ్నేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుబ్బాక ప్రభాకర్, ఉపాధ్యాయులు నర్మద, కవిత, హఫీజ, కావ్య, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఏర్పాటుకు ఉత్తర్వులు

చందుర్తి: మండలంలోని మల్యాలలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పాటుకు రీజనల్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులకు అందుబాటులో బ్యాంకు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ దృష్టికి తీసుకెళ్లారు. రీజనల్ మేనేజర్ బ్యాంక్ ఏర్పాటుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. బ్యాంకు ఏర్పాటుకు సహకరించిన వారికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మల్యాల గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పార్కింగ్ స్థలంలో బీటీరోడ్డు



వేములవాడ: రాజన్న ఆలయ గుడి చెరువు ఖాళీ స్థలంలోని పార్కింగ్ ప్లేస్‌లో ఇంతకుముందు దుమ్ము లేస్తుండేది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల వేములవాడకు రావడంతో అధికారులు కాస్త బీటీ రోడ్డు వేశారు. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా మారింది. శని, ఆది, సోమవారాల్లో వచ్చిన లక్షలాది మంది భక్తులు, వారి వాహనాలకు ఈ రోడ్డు కాస్త సౌకర్యవంతంగా మారిందని చెబుతున్నారు.

సన్మానం



రాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నాగయపల్లి శ్రీ దుబ్బ రాజన్న ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించే గోశాల ప్రహరీ నిర్మాణానికి వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి కొండయ్య, మాసం విష్ణు, దయ్యాల అంజయ్య, ఏముండ్ల, నాగయ్య, పరశురాములు, గుంటి కొమురయ్య, శెట్టిపల్లి రవి, బాపన్న, శంకరయ్య, బండి రజినికాంత్, రొండి శేఖర్, అచ్చ తిరుపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



వీర్నపల్లి: మండలకేంద్రంలోని దసారం రాజేశంకు రూ.17500, జెటల సరితకు మంజూరైన రూ.22,500 విలువైన సీఎంఆర్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండెపల్లి రవి, కుమార్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు పూర్తి చేయాలి

బోయినపల్లి: ఉపాధిహామీ నిధులతో చేపట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో భీమ జయశీల పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చేపట్టే ఉపాధి పనుల జాతరపై సోమవారం రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో చేసే పనులు మార్చి నెలలోగా పూర్తిచేయాలని, నిధులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. రామన్నపేటలో పౌల్ట్రీ షెడ్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో వనం సబిత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రుద్రంగి: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్ వరకు రూ.1.5 కోట్లతో నిర్మించే సీసీరోడ్డు, రామకిష్టాపూర్, మహాలక్ష్మి కాలనీల మధ్య ఉన్న ఒర్రెపై రూ.62 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులకు మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నారని రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్ తెలిపారు. సోమవారం నాయకులతో కలిసి శిలాఫలకం ఏర్పాటుచేసే స్థలాలను పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు గంగ నర్సయ్య, గండి నారాయణ, పిడుగు లచ్చి రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దత్త ఆలయానికి దారిపై మంత్రితో చర్చ

బోయినపల్లి: మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో వరదవెల్లి గుట్టపై గురు దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లేందుకు దారి ఏర్పాటు విషయంలో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, నాయకులతో చర్చించినట్లు సమాచారం. దారి నిర్మాణంలో భాగంగా మట్టిపోసి ఇరువైపులా రాళ్లతో తెట్టెలా కట్టనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన డిజైన్ సైతం వచ్చినట్లు చెబుతున్నారు. గతేదాది ఉత్సవాల సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం రాగా ఆలయ కమిటీ వారు ఆలయానికి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో మంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ వారు దారి ఏర్పాటుపై సర్వేచేశారు. వచ్చేనెలలో ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో దారి పనులకు వచ్చేనెల 5న మంత్రి పొన్నం ప్రభాకర్ భూమిపూజ చేస్తారని తెలుపుతున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	01	448
పార్వతీపురం స్పెషల్	02	672
పార్వతీపురం సాధారణ	01	336

– వేములవాడ



ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. తొంబై శాతం పనులు పూర్తిచేసిన అధికారులు, ఏడాదిగా అటువైపు కన్నెత్తి చూడదం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగులు పనులు పూర్తిచేసి ఇళ్లు లేని పేదలకు గూదు కల్పించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సురేశ్, తహసీల్దార్, ముస్తాబాద్. సెల్‌నెంబర్:7337454446

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626



ప్రమాదం జరిగేదాకా పట్టించుకోరా ?

మండలంలోని లాల్‌సింగ్ తండా గ్రామపంచాయతీ పరిధి వడ్డెర కాలనీ రోడ్డు పక్కనున్న వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, లూజ్ వైర్లను సరిచేయాలని అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ పొలాలకు వెళ్లేవారు భయంభయంగా వెళ్తున్నారు. ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా అని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. – వీర్నపల్లి

కళలను రక్షించుకోవాలి

వేములవాడ: కళలు, కళాకారులను రక్షించుకోవడం మన బాధ్యతని ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా హాజరైన పలువురు కళాకారులను ఆయన సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసంలో రాజన్న సన్నిధిలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, కళాకారులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చివేయాలి



వేములవాడరూరల్: వేములవాడ మండలం నాగాయపల్లి నుంచి మర్రిపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంత ఏర్పడింది. రోజూ వందలాది వాహనాలు నడిచే ఈ రోడ్డుపై ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

చీరెల పంపిణీ



ముస్తాబాద్: మండలంలోని గూడెంలో సామాజికవేత్త చిట్నేని మాధవి, వెంకటేశ్వర్‌రావు దంపతుల కుమారుడు అభినవ్ రావు జన్మదినం సందర్భంగా 55 మంది పేద మహిళలకు సోమవారం చీరెలు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, విద్యాసాగర్‌రావు, అంజన్ రావు, బాలమల్లు, కుమ్మరి ఎల్లం, కుంట రవి, రమేశ్, నవీన్, బొప్ప లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు



తిమ్మాపూర్ - నర్సింగాపూర్ గ్రామాల మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన సూచిన బోర్డు

సాక్షి స్పందన

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్ – నర్సింగాపూర్ గ్రామాల మూలమలుపు వద్ద పోలీసులు సోమవారం హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఈనెల 14న 'మూల మలుపులు మృత్యుదారులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు స్పందించి సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు అతివేగంగా వెళ్లవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

కోనరావుపేట: తూకంలో అవకతవకలు, రైతులను మోసంచేస్తూ దోపిడీకి పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎరవెల్లి నాగరాజు సోమవారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులు నేరుగా రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తున్నారని, తూకంలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. కొన్ని మిల్లుల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు సరిగా చూపడం లేదన్నారు. మోసాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లు, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు.